



రూమ్ తాళం తీసి లోపలికి అడుగుపెట్టిన శంకరానికి కిటికీలోంచి పడివున్న కవరు చూసే సరికి బెలూన్‌లా ఎగిరినంత పనిచేసాడు. ఆత్రుతగా వంగి కవరందుకున్నాడు. చిరపరిచితమైన దస్తూరి చూస్తూనే అతని హృదయం పరవశించింది. నాలుగు రోజులుగా ఎవరి ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నాడో అది ఫలించిందానాడు. ఈ నాలుగు రోజుల అతని నిరీక్షణ అతని అనుమానం, అతని అంచనాలు అన్నీ తారుమారయ్యాయి ఆ క్షణంలోనే

'ఇక ఉత్తరం రాదు. ఆమెకు బాగా కోపం వచ్చి వుంటుంది. నిజమే! తను చేసిన పనికి ఎవరికి కోపం రాదు కనుక." అనుకుంటూ అడక తెరలో పోకచెక్కలా నలిగిన శంకరాన్ని ఆ కవరు మందర మధురానుభూతుల దివ్యలోకంలోకి విసిరి వేసింది.

గుండెల నిండుగా నాలుగు రోజుల తర్వాత మన సారా హాయిగా గాలి పీల్చుకుంటూ కిటికీలోకీవున్న కూజాలో నీళ్ళు గ్లాసులోకి వంపుకుని కవరందుకుని తాపీగా కేండ్‌కాట్ మీద మేనువాల్చాడు. కవరు చింపబోతూ, "బాప్‌రే! ఇంత పెద్ద లెటర్ వ్రాసింది ఏముందో ఇందులో?" అనుకుంటూ క్షణంసేపు తటపటాయించాడు. అతని మనసు చింపమని, వివేకం వద్దని కొన్ని క్షణాలు పోరాడాయి. లేచి కూర్చుని గ్లాసులో నీళ్ళు గటగటా తాగేశాడు.

చూపుడువేలుతో ముందు పళ్ళమీద కొట్టు కుంటూ కూర్చున్నాడు. చింపాలా, వద్దా అన్న సందిగ్ధావస్థలో నీళ్ళలోంచి నేలమీదపడ్డ చేపలా గిల గిలా కొట్టుకున్నాడు శంకరం.

కవరుతీసి తలగడకింద పెట్టేసి లేచి నిలబడ్డాడు కడుపులో ఆత్మారాముడు అరుస్తున్నట్లు తెలుసు కున్నాడు. చెప్పులేసుకుని రూముకు తాళం వేయ బోయాడు.

మనసొప్పలేదు శంకరానికి. ముందు ఉత్తరం చదివాక ఆ తర్వాతే హోటల్‌కు పోవాలను కున్నాడు. అంతలోనే, చెప్పులు వదిలి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు.

ఏదో నిర్ణయించుకున్నవాడిలా గట్టిగా నిట్టూర్చాడు.

చివుక్కున కవరు తీసుకున్నాడు చేతిలోకి.

చించి చిన్నసైజు కథలావున్న కాగితాల దొంతిని బయటకు తీసాడు. కాగితాలకు ఒక వైపుగా గుండుసూది గుచ్చివుంది కాగితాలు తారు మారు అవకుండా కాబోలు.

శంకరం కాగితాలు చూస్తూనే చాలా సీరియస్‌గా మారిపోయాడు. అతని మనసులో ప్రమేయం లేకుండానే అతని నేత్రద్వయం అక్షరాలవెంట పరుగులుతీసింది.

"శంకరంగార్కి!"

సంబోధన చూచి ఉలిక్కిపడుతున్నారా! న్యాయంగా వ్రాయాలంటే ఇలా వ్రాయవల్సి వచ్చి నందుకు కూడా నాలోనేనే సిగ్గుపడుతున్నాను. శంకరం గారూ! ఈ లోకంలో మీలాంటి శంకరంగార్లు చాలామంది అంటే నూటికి ముప్పాతికమంది వుంటారని నేను ముందుగా వూహించలేకపోవటం ముఖ్యంగా నా అసమర్థతే అనిచెప్పాలి. ఈ నాలుగు రోజుల నా ఆవేదనవేరు, మీ ఆలోచనవేరు. కాని ఈ సమస్యకు స్వయంగా నాకుగా నేనే న్యాయ నిర్ణేతను అవుతానని ఏనాడూ అనుకోలేదు.

మీరు చదువుతున్నవారు అయినప్పటికీ ఈ సన్ని వేశంలో 'అరే ఇలా ఎలా జరిగింది.' అని వాపోవ టం సహజం అందుకనే కొంచెం మీమీద జాలితో, ఏమాత్రమో మిగిలివున్న అవకాశాన్ని పునస్క రించుకుని అంతా బాగా అర్థమయ్యేలా వ్రాయ టానికి నేను శ్రమతీసుకోవాల్సివచ్చింది. అంతకు మించి మరోలా అర్థం చేసుకోవద్దని నా ప్రార్థన.

శంకరంగారూ! నేను మిమ్మల్ని ఎలా ప్రేమిం చానో, ఎలా అభిమానించానో, ఎలా ఆరాధించానో నాకుకూడా తెలియనంతగా మీకు తెలుసు ననుకుం టాను. రెండేళ్ళ బలపడిన ఈ మనిద్దరి ప్రేమకు పునాదులు సరిగ్గాలేవని నాలుగురోజుల క్రిందటే మీ సమక్షంలో తెలుసుకోగలిగానంటే నిజంగా నేను ఏం చేయాలి అన్పిస్తోంది. ఒకఫలితమంటూ లేని ఈ ప్రాబ్లమ్‌ను ఇంత సునాయాసంగా సాల్వ్‌చేయ గలుగుతానని నేననుకోలేదు.

"సరే! అసలు సంగతులన్నీ వివరంగా వ్రాయ టం మంచిదనుకుంటాను. ఏమంటారు శంకరం గారూ!

పదిహేను రోజుల క్రిందట మనం కలుసు కున్నప్పుడు ఎప్పటిలాగానే మీ సమక్షంలో సర్వం మరిచి మీ కళ్ళల్లోకిచూస్తూ గంటల్ని క్షణాలుగా దొర్లించిన సంగతి మీకు గుర్తుండే వుండవచ్చు. మనం ఎపుడు కలుసుకున్నా మన భావి జీవితం గురించి, మనం ఒకటయే మధురమైన రోజు కోసం, మన జీవితాలు ఏయే రీతులలో పయనిస్తాయో ననే ఆలోచనలే మనల్ని ఆవరించేయి కదూ!

ఆ రోజుకూడా మనం అలానే ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ మనల్ని మనం మర్చి పోయాం. మీలాంటి సహృదయుల్ని నాకు వరంగా ఇచ్చిన ఆ భగవంతుడ్ని మనసులోనే మెచ్చు కున్నాను. ఏవేవో మాట్లాడుకుంటూ రెండు గంటలు గడిపాము ఎప్పటి మాదిరిగానే.

"అంతలో వున్నట్టుండి మీరేమన్నారో జ్ఞాపక ముందా?"

'విజయా! నేనొకటి చెప్తాను. దానిమీద నీ అభిప్రాయం కావాలన్నారు."

నేను చెప్పమని తలూపాను కదూ!

"విజయా! నేనొకటి చెప్తాను. నన్ను మన స్ఫూర్తిగా నమ్ముతావుకదూ!" అన్నారు మీరు.

నా మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నారు మీరు.

'ఇద్దరు అమ్మాయిలు ఒకే అబ్బాయిని ఒకరికి తెలియకుండా ఒకరు ప్రేమించారని, ఆ అబ్బాయి

ముటుకు అందులో ఒక అమ్మాయినే మనస్ఫూర్తిగా ప్రేమించినట్లు, రెండో అమ్మాయి బాగా డబ్బున్న అమ్మాయి అయినప్పటికీ అతనికి ఆ రెండో అమ్మాయి తన అభిప్రాయం చెప్పినపుడు అతడు కొంచెం కూడా చలించకుండా తన మనస్సు పరాధీన మయిందని ఆ అమ్మాయికి చెప్పినట్లు అని ఒక చిన్న సైజు కథ చెప్పారు. జ్ఞాపకముందా ?" నేను మీరు చెప్పేదంతా మౌనంగానే ఆలకించాను.

అపుడు మీ రన్నారు. "విజయా ! ఈ అబ్బాయి పరిస్థితిలా వున్నప్పుడు నీవు అతని గురించి ఎలా వూహిస్తావు ?" అని అడిగారు,

"ఈ అబ్బాయి డబ్బున్న అమ్మాయి వైపుకే మొగ్గిననాడు అతను ముందునుంచీ ప్రేమిస్తున్న అతని ప్రేమ వట్టినాటకం, అతను కేవలం డబ్బు మనిషి. అలాంటి అతన్ని ప్రేమించిన ఆ మొదటి అమ్మాయి దౌర్భాగ్యురాలు అని అన్నానుకదూ నేను

మీరు హఠాత్తుగా "విజయా ! నువ్వే ఆ మొదటి అమ్మాయివి అయితేనో ?" అన్నారు.

నా తల గిర్రున తిరిగిపోయింది. లోపలికి దిగ మింగిపోతున్న నా గొంతు క్షణంసేపు బయటకు రాలేదు. వణికే పెదాల్ని బలవంతంగా అదిమి పెట్టాను. కళ్ళల్లో ఎరుపుజీరలు కదలాడే వుంటా యనుకుంటాను.

దెబ్బతిన్నట్లుగా చూసాను మీవంక,

మీరు పకపకా నవ్వుతున్నారు. ఆ నవ్వును చూచి భయపడ్డాను. మీరు అలా నవ్వుతూనే నా నడుం చుట్టూ చేతులేసి "పిచ్చివిజయా ! నేనంత మూర్ఖుణ్ణి అనుకున్నావా !" నీకు మాటిచ్చి వేరొక దాని కౌగిలిలో ఒదిగిపోతాననుకున్నావా !" అంటూ రెండు చేతుల్లో నా ముఖాన్ని దగ్గరకు తీసుకుని నా కళ్ళల్లోకి లాలనగా, అభిమానంగా, అంతకుమించిన ప్రేమగా చూసారు.

నా గుండెలు కుదుటబడ్డాయి. మనసారా గాలి పీల్చుకున్నాను. మీ విధేయతకి నా స్త్రీత్వం గర్వించింది. నాలో అహంకారం కట్టలుతెంచుకుని ప్రవహించింది,

"నిజం విజయా ! నన్ను నమ్ముతావు కదూ ! నే నెప్పుడూ నీవాణ్ణే విజయా ! నన్ను దూరంచేసుకోకు విజయా." అంటూ చిన్న పిల్లలా మాట్లాడుతున్న మిమ్మల్ని గర్వంగా మరోమారు చూసుకున్నాను.

మన మధ్య మౌనంగా కొంతసేపు గడచిపోయింది.

"ఇంతకీ ఆ రెండో అమ్మాయెవరో చెప్పారు కారేం ?" అన్నాను కుతూహలంగా నేను.

"ఎందుకు లెద్దూ ఆ గోల" అంటూ తేలిగ్గా త్రోసిపుచ్చారు. నేను వత్తిడిచేశాను మళ్ళీ మళ్ళీ. చెప్తానుకానీ ! ఆవిడ గురించి నువ్వు తక్కువగా అంచనా వేయకూడదు. అయినా నేను నీవాణ్ణి. ఇక వేరేవాళ్ళతో ప్రమేయం ఏముందిలే విజయా." అన్నారు.

నేను మిమ్మల్ని మరోమారు బలవంతం పెట్టాను.

ఎవరో చెప్పమని.

అపుడు మీరు చెప్పారు.

ఆపేరు విన్న నేను క్షణంసేపు ఆశ్చర్యపోయాను. ఆసమయంలో నా బుర్రలో వేలాది ఆలోచనలు బ్రేకులులేకుండా పరుగెట్టాయి.

తలెత్తి మీకళ్ళల్లోకి సూటిగా చూసాను. ఆ కళ్ళు ఆక్షణంలో నిర్మలంగా, పవిత్రంగా ఒక ఆశయంకోసం పోరాడే అలసటను సూచించాయి నాకు.

మిమ్మల్ని రెండేళ్ళుగా ఆరాధించిన బలహీనతకు లొంగిపోయి ఆడదాన్ని నేను కేవలం ఆడదాన్ననే ఆలోచన నరనరం పేరుకుపోయిన ఆలోచనతో మీ గుండెలమీద తలవాల్చి బేలగా, అమాయకంగా, నేను మీకళ్ళల్లోకి దీనంగాచూస్తూ "నన్ను మోసం చెయ్యరుకదూ ?" అన్నాను.

దానికి సమాధానంగా మీరు "విజీ ! నా పిచ్చి విజయా ! ఇంతదారుణంగా నీగురించి ఎలా వూహిస్తున్నావు. నా మీద నీకు నమ్మకం లేదా విజయా." అన్నారు బాధగా.

అపుడనిపించింది నాకు. మిమ్మల్నిగురించి నేను అపోహపడ్డానని మీ మనసులో నాకుతప్ప మరెవ్వరికి చోటులేదని అనుకుని గర్వపడ్డాను.

హాయిగా తృప్తిగా నిట్టూర్చాను.

జరిగినదంతా మళ్ళీ కళ్ళముందు కదలాడ సాగింది. మనసంతా దూదిపింజలా ఎగిరిపోయింది హాస్టల్‌కు వెళ్ళేంతవరకు. ఏమీ తోచక పిక్చర్లు తిరగేశాను. చదవబుద్ధికాలేదు. హాయిగా భోజనంచేసి నిద్రకుపక్రమించాను. అయినా నిద్ర రాలేదు, సరికదా మీ ఆలోచనలు నన్ను నిలువునా ముంచెత్తాయి.

అలా ఆలోచిస్తూ వుట్టినే పడుకున్నాను.

హఠాత్తుగా నాకో ఆలోచన స్ఫురించింది. ఆ విషయం గురించే బాగా ఆలోచించాను. నేను ఏదైనా నిర్ణయించుకుంటే అది వెంటనే అమలు జరుపుకునే తత్వం నాది అని మీకు తెలుసుకదూ !

కాని ఎప్పుడూ నా స్వార్థమే చూసుకునే తత్వం కాదునాది. నేను బాగా ఆలోచించి చేసిన నిర్ణయం మీద ఇద్దరి ఆడపిల్లల నూరేళ్ళ బ్రతుకు ఆధారపడివుంది. కొంతకాలం ఇది మానని గాయంగా అయినా జీవితంలో చూస్తూ చూస్తూ మడిగుండం బారినుండి నన్ను, నాకుగా నా స్నేహితురాల్ని రక్షించాననే ఆత్మతృప్తి నాకు జీవితాంతం మిగిలి వుంటుంది. అందుకనే మీకోక అగ్నిపరీక్షలాంటిది ఏర్పాటు చేశాను. చాలా పకడ్బందీగా. నాకు తప్ప మరెవ్వరికీ దాని తుది మొదలుకూడా అర్థంగాదు. నా పరీక్షలో మీరు విజయలక్ష్మి నేగా నిలిస్తే ఈ విజయ మీ హృదయంలోనే కాదు అణుక్షణం మీ పాదాల దగ్గర దాసిలా పడివుంటుంది. అలా కాకుండా మరో రీతిగా జరిగిననాడు పర్యవసానాన్ని వూహించలేనంత మూర్ఖులు కారనే నా ఉద్దేశ్యం."

చదవటం అపుచేశాడు శంకరం. మిగిలింది చదవనవసరం లేదనిపించింది అతని మనసుకు. తెలియక తప్పుచేస్తే పర్యవసానాన్ని ఫలితాన్ని వూహించలేము గాని. తెలిసిచేస్తూ జరగబోయేది వూహించలేనంత మూర్ఖుడు కాడు యువతరంలోని శంకరం. పిన్ చేసిన కాగితాల దొంతిని టేబుల్ మీద పెట్టి పైన వెయిట్ పెట్టాడు.

పేపర్ వెయిట్‌లో రంగు రంగుల ప్లాస్టిక్ ముక్కలు శంకరాన్ని చూసి పరిహసిస్తున్నాయి.

"విజయా ! అనుకున్నదంతా అయిందికదా ?" అనుకున్నాడు శంకరం. అతని కళ్ళ ముందు విజయ ఏర్పాటు చేసిన అగ్నిపరీక్ష మెదిలింది.

ఆ రోజు మాధురి తను యూనివర్శిటీ నుంచి వచ్చేస్తుంటే ఏదో బుక్ అందించింది.

తాపీగా రూమ్‌కొచ్చి చూసుకున్నాడు. చిన్న సైజు ప్రేమలేఖ వచ్చాలేదు. తను కూడా అమ్మాయిల్ని ఆకర్షిస్తున్నాడు అనుకున్నాడు.

పవిత్రంగా ఒకే ఒక్కసారి ఏ అమ్మాయి అయినా తన మనస్సును అర్పిస్తుంది. కాని ఆ ప్రేమను మగవాడు అర్థంచేసు కోడు. కనీసం అర్థంచేసుకోవటానికి ప్రయత్నించడు. భ్రమరంలా రకరకాల పువ్వుల మకరందాన్ని ఆస్వాదించడానికి తాపత్రయ పడ్తాడు.

ఆ తాపత్రయంలో వెనుక ఒక అమాయక ప్రాణికన్నీటి తెరలలో నిల్చివున్నదని వుంటుందని గ్రహించలేడు.

శంకరం అక్కడే పొరపాటుచేశాడు.

ఈ రోజుల్లో ఎక్కువమంది ఆకర్షణను కల్గి వుండటం ఒక ప్రెస్టేజ్. అది ఒకరకమైన స్టేటస్. అలానే శంకరంకూడా భావించాడు. అంతకాలం విజయేలోకంగా భావించిన శంకరం మాధురి ప్రేమ లేఖతో ఒక్కఅడుగు వెనక్కువేసాడు.

కాని అతని అంతరంతరాల్లో ఎవరు తనకు కావాలి, అన్న సందిగ్ధావస్థలో కొట్టుకుపోయాడు.

'రెండేళ్ళ ప్రణయమూర్తి విజయ !'

'అంతులేని ఆస్తికి అలంబనమాధురి !'

ఎవరివైపుకు మొగ్గాలితను.

ఆ క్షణంలో శంకరం మానవత్వం మూర్తీభవించిన మమతతో విజయనే ఆరాధించాడు.

పర్యవసానం మాధురికి తన అంగీకారం బదులు తనప్రేమను, తనమనసును ఒక అజ్ఞాతవ్యక్తికి అంకితం చేసినట్లు తెలియచేశాడు, విజయను అప్పుడే తెరమీదకు లాగటం అతనికిష్టంలేక పోయింది, ఆ తర్వాతే విజయకు ఈ విషయం తెలియపర్చటం జరిగింది. విజయకళ్ళల్లో మెరుపు, ఆనందం శంకరాన్ని తృప్తిపరిచాయి. ఒకరకంగా గర్వించాడు శంకరం, తను విజయను మోసం చేయలేదు. తనకు కావాల్సింది విజయ పవిత్రమైన మనసు కాని మాధురిఆస్తి. ఆ ఆస్తితో అల్లుకున్న క్షణికమైనది. చంచలమైన మనస్సుకాదు.

ఇది శంకరాన్ని తెలిసినంతవరకూ జరిగింది.

మిగిలింది శంకరం వూహించుకోగలిగాడు.

ఆరోజు రూమ్‌కు వచ్చేసరికి కొత్తదస్తూరితో వున్న కవరందుకున్నాడు.

అందులో సారాంశాన్ని మాధురి స్నేహితురాలెవరో అజ్ఞాతంగా వ్రాసింది.

అంతటి సుదీర్ఘమైన లేఖలో మాధురి మనసు, మాధురిబాధ, మాధురి భవిష్యత్, మాధురి ఆవేదన, మాధురిప్రేమ అంతా పొందుపర్చింది. తనకు కావాల్సింది మాధురి సుఖం అట. అందుకు తన సహకారం కావాలట, అందుకే [illegible]

దీపక్ లో కలుసుకోమని మాధురిని ఆమె అర్థించింది.

స్నేహంలో కూడా ఇంత సహకారం ఉంటుందని శంకరం తొలిసారిగా తెలుసుకున్నాడు. అదీ ముఖ్యంగా ఆడవాళ్ళల్లో.

శంకరం కేవలం మగవాడు. దానికితోడు కొత్త కొత్త ఆశలు చిగురించే వయస్సున్న మనస్సున్నవాడు.

మళ్ళీ ఆలోచించటం ప్రారంభించాడు శంకరం.

మాధురిని దీపక్ లో కలుసుకునే రోజు దగ్గరయే వరకు క్షణంకూడా విశ్రాంతి లేకుండా ఆలోచించాడు శంకరం.

ఆ రోజు రేపే అయింది.

శంకరం అల్లిబిల్లి ఆశలతో భగవంతుని చేతిలో తయారయిన బొమ్మ. భవిష్యత్ మీద ఎన్నో అనుబంధాలు పెంచుకున్నాడు బొమ్మలాంటి శంకరం.

అతని ఆశల శిఖరాల క్రింద విజయ శిధిల మందరయి, ఆ స్థానంలో మాధురి వున్నంతగా పెరిగిపోయింది.

కేవలం శంకరం మానవ మాత్రుడు. ఒక్కొక్కసారి స్వార్థం, త్యాగం రెండూ పోటీపడినా స్వార్థానికే విజయం లభించటం పరిపాటి. మోహం, లోభం శంకరాన్ని పూర్తిగా ఆవహించి అతన్ని మాధురి సమక్షంలోకి విసిరివేశాయి.

మెల్లగా అంతకన్నా మధురంగా ఉడుకులాం, లవండర్ వాసనలు ముక్కు పుటాల్లోకి చొరబడ్తుండగా మాధురిని తన్మయత్వంగా చూస్తూ పరవశంతో "మీ స్నేహితురాలు రాలేదేం?" అన్నాడు.

"వచ్చింది. ఇంటర్వెల్లో కలుస్తానంది. అదిగో ఆవైపు కూర్చుంది." అటుచూపిస్తూ సుతారంగా నవ్వింది మాధురి. దీపక్ లో ఆ స్నేహితురాలెవరో చూడాలనుకున్నాడు శంకరం. చీకట్లో సాధ్యం కాలేదు శంకరానికి.

ఇంటర్వెల్ అయ్యేవరకు మాధురి సన్నని వేళ్ళు చిలిపిగా తాకుతూ, మాధురి ముద్దుమాటలు వింటూ, మాధురి కట్టుకున్న చీర గరగరలు మృదుమధురంగా ఆలకిస్తూ పరవశించిపోయాడు శంకరం.

పదినిముషాలుముందుగా మాధురిలేచి స్నేహితురాలివైపు వెళ్ళింది

మరో రెండు నిముషాల్లో తిరిగివస్తూ "శంకర్! కమాన్! మా ఫ్రెండ్ను ఇంట్రడ్యూస్ చేస్తాను." అంటూ బాల్కనీలో వేసివున్న కుర్చీలవైపుకి నడిచివెళ్ళింది.

శంకరం మాధురిని అనుసరిస్తూ తన్మయంగా ఫీల్ అయ్యాడు పిట్టగోడనానుకుని మోహం అటువైపుగా పెట్టుకుని నిలబడ్డ స్నేహితురాలితో "కమాన్ విజీ! నమోస్తా, కోకాకోలా తీసుకుందామా? ఆ అన్నట్లు వీరు ..." అర్థోక్తితో ఆగిపోయింది మాధురి.

పులిక్కిపడ్డాడు శంకరం పేరు విని.

ఆమె ఇటువైపుకు తిరుగుతూ శంకరం కళ్ళల్లోకి చూచింది లోతుగా. ఆ కళ్ళల్లో తీక్షణతలేదు. మోసం చేశావా అన్న బాధ ఆవేదన లేవు.

"హాయ్ శంకర్! నువ్వు కేవలం మనిషివయ్యావు!" అన్నట్లున్నాయి ఆ చూపులు. ఆ చూపులు శంకరాన్ని ప్రేమించిన విజయవి. యాంత్రికంగా చేతులు జోడించింది విజయ.

మాధురి కోకా కోలా ఆఫర్ చేస్తూ గలగలా నవ్వుతోంది. అందుకుంటూ విజయ వెయ్యి అగ్ని పర్వతాలు దాచుకుంటూ చల్లగా నవ్వుతోంది.

ఆ నవ్వు కేవలం ఆర్టిఫిషియల్.

బాటిల్ అందుకుంటున్న శంకరం మేను జలదరించింది.

మాధురి బాటిల్ పెట్టేసి కర్చీఫ్తో పెదాలు సుతారంగా అద్దుకుంటూ "విజీ! ఎలా వుంది పిక్చర్. బోరింగ్గా లేదూ నీకు. మీకు శంకర్?" అంటూ అడుగుతోంది, ఇద్దర్నీ ఉద్దేశిస్తూ.

విజయ నవ్వింది మళ్ళీ. ఆ నవ్వు స్వచ్ఛంగా వుంది. విజయ పళ్ళు కడిగిన ముత్యాల్లా తళుక్కుమన్నాయి.

కుర్చీలోంచి లేస్తూ బేగ్ చేతిలోకి తీసుకుంది. శంకరంవైపు చూస్తూ, "లేదు మధూ! రియల్లీ! ఐ లైక్ వెరి మచ్ దిస్ పిక్చర్! ఎంత నేచురల్గా నగ్నసత్యాన్ని తెలుసుకోవచ్చో ఇందులో తెలుసుకోగలం. ఏమంటారు శంకరంగారూ! ఒకే వరలో రెండు కత్తులు ఇమడవచ్చునుకాని. ఆ రెండు కత్తుల్లో దేనికో దానికి రాపిడి వుంటుందికదూ! మధూ! నే వెళ్తాను. ట్రయిన్కు టయిమవుతుంది. శంకరంగారూ! విష్ యు బెస్ట్ ఆఫ్ లక్." విజయ మెల్లిగా నడిచి వెళ్ళిపోయింది.

శంకరం తేరుకోలేకపోయాడు షాక్లోంచి.

శంకరం బాహ్యస్థితిలోకి వచ్చాడు. విజయ వ్రాసిన కవరు తనను వెక్కిరిస్తోంటే మళ్ళీ ఆ కాగితాల దొంతిని చేతిలోకి తీసుకోబోయాడు. ఎవరిదో కారు హారన్ ఎడతెరపి లేకుండా మోగుతుంటే చివ్వున లేచి కిటికీలోంచి తొంగి చూసాడు శంరం.

ఎదురింటి మేడ ముందు కారు ఆగివుంది. మెట్లుదిగుతున్న ఆ మేడ అధికారి కొడుకు ఇన్నిప్ బ్యాట్ వూపుకుంటూ నవ్వుతూ వస్తున్నాడు. సీరింగ్ ముందు తనకు వారం రోజుల క్రిందట మనస్సు నర్పించానన్న మాధురి.

స్తంభించి పొయ్యాడు శంకరం.

ఫ్రంట్ డోర్ తెరుచుకుని కూర్చుంటూ మాధురి తలమీద సుతారంగా కొడ్తూ చిలిపిగా నవ్వుతున్నాడా యువకుడు.

శంకరం బుసలు కొట్టాడు. అతని ఆవేశం అర్థంలేనిది, అనవసరమయినదని అతనికి తెలియదు.

కారు దుమ్ము లేపుకుంటూ ముందుకు సాగిపోయింది.

శంకరం వుస్సూరుమన్నాడు, టేబుల్ మీద కవరు వెక్కిరిస్తోంది. శంకరాన్ని చూసి కాదు. అతని చంచలమైన క్షణికమైన మోహాన్ని, ప్రేమను చూచి.

విజయ నవ్వుతోంది గదిగోడలు ప్రతిధ్వనించేలా విజయ ఏడుస్తోంది శంకరం స్వాధీనమయిన గుండెల్లో మండుతున్న మంటల్లోంచి.

అంకితం:

"ఈ నవ్యసమాజంలో శంకరంలాంటి శంకరాలు చాలామందికి సానుభూతితో"

★

# రోగవాహకులు

[16 వ పేజీ తరువాయి]

పొందవచ్చు.

(1) అపరిశుభ్రమైన పరిసరాలనుండి వ్యాపితమయ్యే వ్యాధుల బారినుండి రక్షణ పొందగలం.

(2) వర్ణ భేదాలులేని మానసిక భౌతికారోగ్యాలను అభివృద్ధి పరచుకోగలం.

పరిసరాలు పరిశుభ్రంగా వుంచటంచేత ఉత్తర అమెరికాలో విషజ్వరం, ఇటలీలో శీతల జ్వరం మచ్చుకైనా కానరాకుండా పోయినాయి. ఈరోజుల్లో కూడా కొందరు యిలాటి ఆరోగ్య విధానాన్ని పాటించడం చాలా వ్యయ విలాస పూరితమని దురభిప్రాయ పడుతున్నారు.

కాని దేహ శుభ్రత, దేహ శుభ్రత ఎటువంటి వ్యయ పూరితాలు కావని మనం తెలుసుకోవాలి. ప్రధానంగా తన గృహం నుండి దగ్గు మొదలైన వ్యాధులు పొరిగింటివారికి వ్యాపించకుండా చేయడానికి ఖర్చు ఏమాత్రమూ చేయనవసరం లేదు.

ఇది ఆరోగ్య సూత్రాల్లో కెల్లా పెద్దది, విలువైనది. అమూల్యమైనది.

"ఆరోగ్యమే మహాభాగ్యము"

[సమాప్తం]




దీర్ఘరోగులకు
ఉత్తమ వైద్యము

హస్త ప్రయోగం, అవయవము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, ఉబ్బసము, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, కడుపునొప్పి, చెవుడు ...

పోస్టుద్వారా చికిత్స చేయబడును.

డా॥ పి. కుమారస్వామిదేవర,
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ నెం. 551.
బ్రాంచి : 8-డి, శివాజీస్ట్రీట్, మద్రాసు-17.